మన.. ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం...

PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 269 | బుధవారం | 28-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది



- ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ
- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య

మన ప్రజాపక్షం,హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు.“రాష్ట్రం

గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలపై, రక్షా ఎక్స్ పో, ఇండియా జాయ్ ఈవెంట్లపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ ప్రపంచస్థాయిలో పెరిగే అవకాశం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి రేపు దిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సీఈవోలు, ప్రతినిధులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, మన విజయాలను అతిథులకు చాటిచెప్పేలా హైదరాబాద్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై రేవంత్ రెడ్డి సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలపై, రక్షా ఎక్స్ పో, ఇండియా జాయ్ ఈవెంట్లపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.



కేటీఆర్,హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు

మహేశ్ గౌడ్

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుస్తుందని మహేశ్ గౌడ్ ధీమా
- తెలంగాణలో బీజేపీ పని అయిపోయిందని వ్యాఖ్య
- ఆలోచన లేకుండా అప్పులు చేసి కేసీఆర్ రాష్ట్రాన్ని ముంచారని ఆరోపణ

మన ప్రజాపక్షం,హైదరాబాద్

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఇంకా భ్రమల్లోనే జీవిస్తున్నారని, క్షేత్రస్థాయి వాస్తవాలను వారు గ్రహించడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ

‘ఇప్పుడు నా వంతు నా కథ నేనే చెబుతా’

ఆత్మకథపై సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ త్వరలో రానున్న తన ఆత్మకథ పుస్తకం ‘బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్’ గురించి మాట్లాడారు.

కొత్తగా రూ.1,000 నోటు వస్తోందా? వైరల్ వార్తలపై కేంద్రం కీలక ప్రకటన

మన ప్రజాపక్షం,హైదరాబాద్

దేశంలో కొత్తగా రూ.1,000 నోటు విడుదల కానుందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. ఈ వార్తల్లో నిజం లేదని, అవన్నీ నకిలీ ప్రచారాలని స్పష్టం చేసింది. కొత్త రూ.1,000 నోటు విడుదలపై ‘రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా’ (ఆర్‌బీఐ) ఎలాంటి ప్రకటన చేయలేదని వెల్లడించింది.ఇటీవల ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో పసుపు రంగులో ఉన్నట్లు కనిపించే రూ.1,000 నోటు చిత్రాలు వైరల్ అయ్యాయి. కొత్త నోటును ఇప్పటికే విడుదల చేశారని, మరికొందరు నిర్దిష్ట తేదీన



సాంకేతిక రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

ప్రధాని మోదీ

తుమ్మిడిహెట్టి చర్చలు పెద్ద డ్రామా

బాల్క సుమన్

- ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్రంలో కరవు నెలకొందన్న బాల్క సుమన్
- నీళ్లు, కరెంట్ లేక రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన
- సమస్యలు పరిష్కరించకుండా హరీశ్, కేటీఆర్‌లపై విమర్శలెందుకని ప్రశ్న



బడులు పెట్టి.. చేతులు దులుపుకొంటే సరిపోదు

రేవంత్ సర్కార్‌పై ఆకునూరి మురళి తీవ్ర విమర్శలు

- విద్యా వ్యవస్థలో లోపాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ ఐఏఎస్
- పిల్లల భద్రతపై ప్రభుత్వానికి నిబద్ధత ఉండాలంటూ వ్యాఖ్యలు
- తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్
- విద్యా బడ్జెట్ పెంచాలని, స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని సూచన
- ఐదేళ్ల విద్యా ప్రణాళిక అమలు చేయాలని విజ్ఞప్తి



గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా

ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్

తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో నీళ్లు తెస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్

ప్రస్తుత కరవు కాంగ్రెస్ తెచ్చిన కరవు అని విమర్శ

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్



మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం సాధ్యమని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే

“ఫ్రీ బస్సు ఎక్కి భార్య వెళ్లిపోయింది”..

పథకం రద్దు చేయాలంటూ ఎమ్మెల్యేకు వ్యక్తి వినతి!



- కరీంనగర్ జిల్లా రేగులపల్లిలో ఘటన
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు సమస్యను వివరించిన కనకయ్య అనే వ్యక్తి
- తనతో గొడవ తర్వాత ఆమె ఫ్రీ బస్సు ఎక్కి వెళ్లిపోయిందని ఆవేదన
- రెండు మూడు రోజులుగా వెతుకుతున్నా ఆచూకీ తెలియలేదని వెల్లడి
- భార్య కోసం వెతకడానికి రూ.2-3 వేలు ఖర్చు చేశానన్న వ్యక్తి

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకంపై ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. తన భార్య ఫ్రీ బస్సు ఎక్కి వెళ్లిపోయిందని, ఆమె ఆచూకీ తెలియడం లేదని ఎమ్మెల్యే ఎదుట అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా తన భార్య కనిపించకుండా పోవడానికి ఉచిత బస్సు

నీటి వృథాను అరికట్టేందుకు యాప్

నవంబర్ 1న విడుదల!



హైదరాబాద్‌లో నీటిని వృథా చేస్తే జరిమానా విధించేందుకు జలమండలి యాప్‌ను రూపొందిస్తుంది. పాన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నవంబర్ 1న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వినోదం ముఖ్యమా? ప్రాణం ముఖ్యమా?

ఇయర్‌ఫోన్స్ వాడకంపై సజ్జనార్ హెచ్చరికలు



ప్రస్తుతం యువత అధికంగా ఇయర్‌ఫోన్లు వాడుతున్నారు. దీనివల్ల చుట్టూ ఏం జరుగుతుందో గమనించకుండా ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిపై సీపీ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

మన ప్రజాపక్షం,హైదరాబాద్

హైదరాబాద్‌లో ఇటీవల ఓ విషాదకరమైన ఘటన జరిగింది. చెవిలో ఇయర్‌ఫోన్లు పెట్టుకొని, రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ వ్యక్తి దుర్మరణం

All are Continues Second Page

కేటీఆర్,హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు

మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలు చేశారు.మేధావి అని చెప్పుకునే కేసీఆర్ ఎలాంటి ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ గౌడ్ విమర్శించారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటే, దాని గురించి హరీశ్ రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, 90,000 ఉద్యోగాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కాంగ్రెస్‌కే ఓటు వేస్తారని... క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలంగా ఉందని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని... దేశంలో ఎక్కడా లేనంతగా తమ పార్టీలో సమన్వయం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. నవంబర్‌లో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఆ తర్వాత తమ ప్రత్యక్ష లక్ష్యం ఎన్నికలేనని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఆ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రస్తుతం ఉన్న 8 ఎంపీ సీట్లలో రెండు కూడా గెలవడం కష్టమేనని.. మరోవైపు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరు కూడా గెలవరని అన్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 40 శాతం సీట్లు తమకే వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తుమ్మిడిహెట్టి చర్చలు పెద్ద డ్రామా

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే పంటలు ఎండిపోతున్నాయని, ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, ప్రభుత్వమే సృష్టించిన కరవు అని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.రైతులు నీళ్లు, కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం తుమ్మిడిహెట్టి పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని సుమన్ మండిపడ్డారు. ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వంతో రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జరిపిన చర్చలను ఓ పెద్ద డ్రామాగా అభివర్ణించారు. ఉన్న నీటిని ముందుగానే వదిలేసి, ఇప్పుడు బ్యారేజీ నిర్మిస్తామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడానికే అని అన్నారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మాజీ మంత్రి హరీశ్ రావు పూర్తి వివరాలతో నిన్ననే వివరించారని గుర్తు చేశారు. సమస్యపై స్పందించకుండా మంత్రులు కేవలం హరీశ్ రావు, కేటీఆర్‌లను దూషించడం సరికాదని హితవు పలికారు.పాలమూరు-రంగారెడ్డి లిఫ్టులను ఆన్ చేసి ఉంటే సంబంధిత జిల్లాలకు నీరందేదని సుమన్ అభిప్రాయపడ్డారు. నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం గతంలోనే స్పష్టం చేసినప్పుడు, తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రైతుల సమస్యల నుంచి దృష్టి మరల్చడానికే ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్, ఎంత ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుంది, అయ్యే ఖర్చు వివరాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కురువ విజయ్ కుమార్, కె. కిశోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

మొదటి పేజీ తరువాయి

భారతదేశం భవిష్యత్తు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, సరికొత్త ఆవిష్కరణలను ధైర్యంగా ముందుకు తీసుకెళ్లడమే కాకుండా, వాటి అభివృద్ధిలో ప్రపంచానికే నాయకత్వం వహించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఎక్కడో అభివృద్ధి చేసిన సాంకేతికతలను వాడుకునే స్థితి నుంచి నేడు ప్రపంచ సవాళ్లకు భారతదేశమే సొంతంగా పరిష్కారాలను సృష్టించే స్థాయికి ఎదిగిందని ఆయన గుర్తు చేశారు. దిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం 'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ 2026 (జుఁ×జ 2026)' ను మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగానే సదస్సును ఉద్దేశించి మాట్లాడిన మోదీ– సాంకేతికత విషయంలో ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయికి భారత్ ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా యువ భారతీయ ఆవిష్కర్తల ఆలోచనలు, ఆత్మవిశ్వాసాన్ని మోదీ ప్రశంసించారు.

కొత్త సాంకేతికతను సృష్టించాలి

గతంలో భారత్‌కు సైన్స్, టెక్నాలజీ అంటే ఇతర దేశాలను, వాటి ఆవిష్కరణలను అనుసరించడం అన్న భావనే ఉండేదని మోదీ వ్యాఖ్యానించారు. కానీ ఇటీవలి కాలంలో పరిస్థితులు మారాయని, భారత శాస్త్ర సాంకేతిక రంగంలో వచ్చిన మార్పును కొనియాడారు. ఇందుకు ఉదాహరణలుగా అంతరిక్ష రంగంలోని భారత విజయాల్ని మోదీ ప్రస్తావించారు. తొలి ప్రయత్నంలోనే అంగారక గ్రహాన్ని చేరుకున్న భారత్, చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరుకోవడంలోనూ చారిత్రక విజయం సాధించిందని గుర్తుచేశారు. ఇంకా కొవిడ్ మహమ్మారి సమయంలోనూ భారత్ తన శక్తి సామర్థ్యాలను నిరూపించుకుందని అన్నారు. ప్రపంచంలోని ఇతర దేశాలు వ్యాక్సిన్ లేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు, భారత్ దేశీయంగా టీకాను అభివృద్ధి చేసి పెద్ద ఎత్తున టీకా కార్యక్రమాన్ని నిర్వహించిందని ప్రధాని వివరించారు. ఆపదలో ఉన్న ఇతర దేశాలకు కూడా వ్యాక్సిన్ సరఫరా చేసిందని తెలిపారు.

బడులు పెట్టి చేతులు దులుపుకొంటే సరిపోదు..

మొదటి పేజీ తరువాయి

ఖమ్మం జిల్లాలో ఐదేళ్ల చిన్నారి ధనశ్రీ మృతి ఘటనపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పిల్లలకు సరైన వసతులు, భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. పిల్లల విద్య, భద్రత విషయంలో ప్రభుత్వానికి అవసరమైన నిబద్ధత కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.ఖమ్మం జిల్లా కేవీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో విషకీటకం కుట్టడంతో ఐదేళ్ల ధనశ్రీ మృతి చెందిన ఘటనపై మురళి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సారీ తల్లీ ధనశ్రీ.. నిన్ను ఈ ప్రపంచానికి దూరం చేసుకున్నాం. అన్ని బడుల్లో మంచి వసతులతో కూడిన ప్రీప్రైమరీ తరగతులు, గదులు ఉండి ఉంటే నువ్వు ఈ రోజు బతికి ఉండేదానివి" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.పిల్లల విద్య, భద్రత ప్రభుత్వానికి ప్రాధాన్య అంశాలు కావాలని ఆకునూరి మురళి సూచించారు. కనీస సౌకర్యాలు లేని ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలోని 60 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా కమిషన్ సిఫార్సుల ప్రకారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులతో తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యా బడ్జెట్‌ను పెంచాలని, విద్యార్థుల సౌకర్యార్థం స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తక్షణమే ఐదేళ్ల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు.మరోవైపు, అంగన్‌వాడీ టీచర్ స్థానికంగా ఉండకపోవడం, నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని స్థానికులు ఆరోపించారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులతో కలిసి టేకులపల్లి రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ నిరసనకు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

గ్రావిటీతో నీళ్లిస్తే రాజీనామా చేస్తా

మొదటి పేజీ తరువాయి

పదవికి రాజీనామా చేస్తానని, ఒకవేళ నిరూపించలేకపోతే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. గ్రావిటీతో నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని ఆయన మండిపడ్డారు.రాష్ట్రంలో నెలకొన్న కరవుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని హరీశ్ ఆరోపించారు. "ఇది కాలం తెచ్చిన కరవు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నా ఎత్తిపోతలు చేపట్టకుండా ప్రభుత్వం రైతులను నష్టపరుస్తోందని విమర్శించారు. 33 శాతం వర్షపాతం లోటు ఉన్న ఏపీలో లేని క్రాప్ హాలిడే, కేవలం 17 శాతం లోటు ఉన్న తెలంగాణలో ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు.ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, అసలు ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు బహిర్గతం చేయడం లేదని నిలదీశారు. తుమ్మిడిహెట్టి వద్ద తగినంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన తర్వాతే, తమ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని ఆయన గుర్తుచేశారు.

'ఇప్పుడు నా వంతు నా కథ నేనే చెబుతా'

మొదటి పేజీ తరువాయి

తన జీవితంపై దశాబ్దాలుగా ఇతరులు ఎన్నో కథనాలు రాశారని, ఇప్పుడు తన కథను తానే స్వయంగా చెప్పాలనుకుంటున్నానని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తెలిపారు. తన జ్ఞాపకాలతో, జీవిత విశేషాలతో త్వరలో రానున్న ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆమె తాజా వ్యాఖ్యలు చేశారు. తన జీవితం గురించి గతంలో వచ్చిన ఎన్నో అపోహలు, కల్పిన కథనాలను సరిదిద్దడానికే ఈ పుస్తకాన్ని రాయాలని నిర్ణయించుకున్నట్లు ఆమె చెప్పారు. ఈ పుస్తకం విడుదలయ్యాక తనను ప్రజలు చూసే కోణంలో కచ్చితంగా మార్పు వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం రోజు సోనియా గాంధీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు. పుస్తకం విడుదలయ్యాక కొంత తమాషా (రచ్చ లేదా దుమారం) తప్పదని ఆమె పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా ఇతరులు తన కథను చెబుతూ వచ్చారని, ఇప్పుడు తన వంతు వచ్చిందని స్పష్టం చేశారు.

రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రి కావడాన్ని వ్యతిరేకించా!

ఈ వీడియోలో సోనియా గాంధీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. తన భర్త భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని– ప్రధాన మంత్రి పదవి చేపట్టాలని కోరినప్పుడు తాను పూర్తిగా వ్యతిరేకించానని చెప్పారు. అప్పట్లో తన గురించి చాలా విషయాలు రాశారని, వాటిలో కొన్ని వాస్తవాలకు చాలా దూరంగా ఉన్నాయని ఆమె వివరించారు. మరికొన్ని కల్పితమైనవని, ఇంకొన్ని అతి చేసి చూపించాయని సోనియా గాంధీ పేర్కొన్నారు. అందుకే తన జీవితంలో జరిగిన సంఘటనలను, తన అనుభవాలను వాస్తవాలకు దగ్గరగా వివరించాలనే ఆలోచన తనకు కలిగిందని చెప్పుకొచ్చారు. తాను రాసింది కేవలం తన వైపు నుంచే చెప్పే వాదనే కాదని, తన జీవితంలో జరిగిన విషయాలను వివరించే కథ అని సోనియా గాంధీ వీడియోలో తెలిపారు. ఈ పుస్తకం ద్వారా తన జీవితంలోని సంఘటనలను పాఠకులు మరో కోణంలో అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు.

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు.అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు

"ఫ్రీ బస్సు ఎక్కి భార్య వెళ్లిపోయింది"..

మొదటి పేజీ తరువాయి

పథకమే కారణమంటూ దాన్ని రద్దు చేయాలని కోరాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం బెజ్జంకి మండలం రేగులపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో జరిగిన ఓ సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి కనకయ్య అనే వ్యక్తి తన కుటుంబ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు.తన భార్యతో గొడవ జరగడంతో ఆమెను మందలించానని, దీంతో ఆమె ఉచిత బస్సు ఎక్కి వెళ్లిపోయిందని కనకయ్య తెలిపాడు. రెండు మూడు రోజులుగా వెతుకుతున్నా ఆమె ఆచూకీ లభించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆమె కోసం వెతకడానికి ఇప్పటికే రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని చెప్పాడు.తన భార్య కనిపించకుండా పోవడానికి ఉచిత బస్సు పథకమే కారణమని భావిస్తున్నట్లు కనకయ్య ఎమ్మెల్యేకు తెలిపాడు. అందుకే ఆ పథకాన్ని రద్దు చేయాలని కోరాడు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.. మహిళ ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉచిత బస్సు పథకం వల్ల రాష్ట్రంలో ఎంతోమంది మహిళలు ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు.

వినోదం ముఖ్యమా? ప్రాణం ముఖ్యమా?

మొదటి పేజీ తరువాయి

చెందాడు. ఇయర్‌ఫోన్లు పెట్టుకొని, చుట్టూ ఏం జరుగుతుందో ఏమాత్రం గమనించని ఆ వ్యక్తి రైలు ప్రమాదానికి బలైపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనర్ ఎక్స్ వేదికగా షేర్ చేస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఇయర్‌ఫోన్లు వినోదాన్ని ఇస్తున్నాయా?

'మీ ప్రాణం కంటే ఒక ఫోన్ కాల్ ముఖ్యమా? ఇంట్లో మీ కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల కంటే పాటలే అంత ముఖ్యమా?' అని సోషల్ మీడియా వేదికగా ప్రజలను ప్రశ్నించారు. ఆధునికత పేరుతో వినియోగించే ఇయర్‌ఫోన్లు నిజంగా వినోదాన్ని ఇస్తున్నాయా? లేక అవే ప్రమాదాన్ని, మరణాన్ని కూడా వినపడనీయకుండా చేసి ప్రాణాలను తీసేస్తున్నాయా? అని సజ్జనార్ ప్రశ్నించారు.

అందుకే ఇలాంటి ఘోర ప్రమాదాలు

'ఫోన్ కాల్‌లో మునిగిపోయి, బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా రైలు పట్టాల వెంబడి నడుస్తున్న వ్యక్తిని, వెనుక నుంచి వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టిన ఈ దృశ్యం ఎవరినైనా కలచివేస్తుంది. హైదరాబాద్‌లోని బొల్లారం సమీపంలో ఇటీవల ఈ ప్రమాదం జరిగింది. ఏమరుపాటు లేదా నిర్లక్ష్యం ఎంతటి ప్రమాదానికి దారితీస్తుందో చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ మరొకటి ఉండదు. రైలు వస్తున్నప్పుడు వచ్చే పెద్ద శబ్దాన్ని, దాని హారన్ శబ్దాన్ని కూడా గమనించలేనంతగా ఏకాగ్రత కోల్పోవడం వల్ల ఇలాంటి ఘోర విషాదాలు జరుగుతున్నాయి' అని సోషల్? మీడియా వేదికగా సజ్జనర్ ఆందోళన వ్యక్తం చేశారు.

గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర సంప్రదాయాలు ప్రతిబింబించేలా డిజైన్లు ఉండాలి

హైదరాబాద్‌లో పలు చోట్ల డ్రోన్ ఆధారిత ప్రచారం చేపట్టాలని, క్లైమేట్ చేంజ్, ఏఐ రంగాలకు సంబంధించిన ప్రముఖులను ఆహ్వానించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సంప్రదాయాలు ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్ ఆవరణలో డిజైన్లు ఉండాలని, కాకతీయ కళా తోరణం, రామప్ప ఆలయం డిజైన్లకు ప్రాముఖ్యతను ఇవ్వాలని స్పష్టం చేశారు. బతుకమ్మ గురించి అతిథులు తెలుసుకునేలా ప్రత్యేక డిజైన్లు, ఏర్పాట్లు చేశామని అధికారులు సీఎం వివరించారు.

కొత్తగా రూ.1,000 నోటు వస్తోందా?

వైరల్ వార్తలపై కేంద్రం కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి

అందుబాటులోకి రానుందని ప్రచారం చేశారు. దీంతో కొత్త నోటు వస్తుందా? అంటూ నెటిజన్లలో చర్చ మొదలైంది.ఈ నేపథ్యంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది. కొత్త రూ.1,000 నోటు విడుదలైందంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా తప్పని పేర్కొంది. ఇలాంటి వార్తలను నమ్మే ముందు అధికారిక సమాచారాన్ని పరిశీలించాలని, నిర్ధారణ కాని పోస్టులను ఇతరులకు షేర్ చేయవద్దని ప్రజలకు సూచించింది.ప్రస్తుతం దేశంలో ఆర్‌బీఐ మహాత్మా గాంధీ (న్యూ) సిరీస్‌లో రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లు చెలామణిలో ఉన్నాయి. 2016 నవంబర్ 8న కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దును ప్రకటించినప్పుడు అప్పటివరకు చెలామణిలో ఉన్న పాత రూ.500, రూ.1,000 నోట్లు చట్టబద్ధమైన చెల్లింపుల హోదాను కోల్పోయాయి. అనంతరం కొత్త డిజైన్‌తో రూ.500 నోటును ప్రవేశపెట్టారు. అయితే, రూ.1,000 నోటును తిరిగి చెలామణిలోకి తీసుకురాలేదు.దాని స్థానంలో ప్రవేశపెట్టిన రూ.2,000 నోటును కూడా ఆర్‌బీఐ 2023 మేలో చెలామణి నుంచి ఉపసంహరించుకునే ప్రక్రియను ప్రకటించింది. కాబట్టి కొత్త రూ.1,000 నోటుపై అధికారిక ప్రకటన వచ్చిందంటూ ప్రచారం చేసే పోస్టులను ప్రజలు నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు.



ఈవీఎం గోదాం తరలింపునకు ప్రత్యామ్నాయ వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమీపంలో ప్రస్తుతం ఉన్న ఈవీఎం గోదాం జాతీయ రహదారి-167 కే నిర్మాణ పనుల పరిధిలోకి వస్తున్న నేపథ్యంలో ఈవీఎం గోదాను నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ భవన వసతులను అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, నాగర్ కర్నూల్ ఆర్డిఓ అర్చనలతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు.ఈ సందర్భంగా నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎం గోదాం ఏర్పాటుకు అనువైన గదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, గోదాం తరలింపునకు అవసరమైన తాత్కాలిక ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన ఈవీఎం గోదాం నిర్మాణం పూర్తయ్యే వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) భద్రత, రక్షణ, నిల్వకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర భద్రతాపరమైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.ఈవీఎం గోదాం తరలింపు ప్రక్రియను చేపట్టే ముందు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల నుంచి నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అనుమతులు లభించిన అనంతరమే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం తరలింపు చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్ ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.



అయ్యవారిపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం

ఉప్పునుంతల,మన ప్రజాపక్షం:
ఉప్పునుంతల మండల కేంద్రంలోని అయ్యవారిపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ మరియు పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఫర్టిలిటీ క్యాంపు మరియు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జగత్ రెడ్డి ప్రారంబించారు.మండల పశువైద్యాధికారి డా.ప్రవీణ్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి పాడి పశువుకి ఖనిజ లవణ మిశ్రమాన్ని తప్పకుండ ఇవ్వాలని,దూడలకి పుట్టిన వారం రోజుల లోపే మొదటి సారి నట్టల నివారణ మందుల్ని వేయాలని,తదుపరి నెలకు ఒకసారి ఆరు నెలలవరకి నట్టల మందులు తాగించి లేగ దూడలని ఆరోగ్యంగా ఉండేలాగా చూసుకోవాలని చెప్పారు.ఇప్పుడున్న కరువు పరిస్థిని దృష్టిలో ఉంచుకొని జాబ్ కార్డు ఉన్న పాడి రైతులు,గొర్రెల మేకల పెంపక దారులు,పందుల పెంపకందారులు పశువుల షెడ్,గొర్రెల మేకల షెడ్,పందుల షెడ్ ని వీబిజి రామ్ జి పథకంలో వచ్చే ఆర్థిక సహకారంతో నిర్మించుకోవచ్చని తెలియచేయడం జరిగింది.అదేవిదంగా క్రాప్ లోన్ మాదిరిగానే కిసాన్ క్రెడిట్ కార్డు పథకంలో భాగంగా పశుపోషణ ఖర్చుల నిమిత్తం బ్యాంకుల నుండి తక్కువ వడ్డీకే రుణ సదుపాయం ఉందని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డా. రంజిత్,సిబ్బంది గోపాల మిత్ర సూపర్ వైజర్ మురళీధర్,ముజీబ్, అంజయ్య, తిరుపతియ్య,శ్రీను గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా టీపీసీసీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా గుండె పాల్

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుండె పాల్ నియమితులయ్యారు.ఈ మేరకు జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ ఛైర్మన్ వేముల మల్లేష్ మహరాజ్ అధికారిక నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పత్రంలో పేర్కొన్నారు.?ఈ సందర్భంగా ఛైర్మన్ వేముల మల్లేష్ మహరాజ్ మాట్లాడుతూ గుండె పాల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన డిసిసి అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్ లకావత్ మరియు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల మల్లేష్ మహారాజ్ లకు గుండె పాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ పటిష్టతకు, అణగారిన వర్గాల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

డిసెంబర్ నెలాఖరులోగా 550 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న 550 పడకల ఆసుపత్రి పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ మంగళవారం సందర్శించి క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, ఇంకా ఎలాంటి పనులు చేపట్టాల్సి ఉంది, నిర్దిష్ట గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి అనే అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. మిగిలి ఉన్న పనులను గుర్తించి, వాటిని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని



సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న 550 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను రానున్న డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దిష్ట లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రభుత్వం నిర్దేశించిన నమూనా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నాణ్యతతో పాటు పనుల ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేయడమే కాకుండా, భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆసుపత్రి నిర్మాణం నాణ్యతతో ఉండాలని సూచించారు.నిర్మాణంలో మిగిలి ఉన్న పనులను గుర్తించి, వాటి పూర్తికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను సకాలంలో పరిష్కరించుకోవాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పనులను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసేలా బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎండి సులేమాన్, ఇంజనీరింగ్ అధికారి సుధాకర్ రెడ్డి, ఇతర మెడికల్ కళాశాల అధికారులు తదితరులు ఉన్నారు.

రైతు నేస్తం ద్వారా ఆధునిక సాగు పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలి

112వ రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:నాగర్ కర్నూల్ నియోజకవర్గం తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామ పరిధిలోని ఇంద్రకల్ క్లస్టర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర స్థాయి నుంచి వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, రైతులకు అందుతున్న పథకాలు, వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకొని, శాస్త్రీయ సాగు విధానాల ద్వారా మెరుగైన దిగుబడులు సాధించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా రైతులు వ్యవసాయంలో రాణించాలని కలెక్టర్ అన్నారు. మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తాడూరు మండల పరిధిలోని ఇంద్రకల్ గ్రామ రైతు వేదికలో రైతులతో కలిసి 112వ రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి నుంచి వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అందించిన సలహాలు, సూచనలను జిల్లా కలెక్టర్ రైతులతో కలిసి వీక్షించారు. సూపర్ ఎల్ నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు, బిందు సేద్యం



ద్వారా కూరగాయలు, ఆకుకూరల సాగు వంటి అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని వరిశీలించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, సాగునీటి సమర్థ వినియోగం, పంటల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు వివరించిన అంశాలను రైతులు తెలుసుకున్నారు.వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకునే మార్పులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ నిపుణులు సూచించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, నేల స్వభావం, పంట అవసరాలను పరిగణనలోకి తీసుకొని సాగు ప్రణాళిక రూపొందించుకోవడం కీలకమని వివరించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా సాగులో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించుకోవచ్చని, అందుబాటులో ఉన్న వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంలో బిందు సేద్యం కీలక పాత్ర పోషిస్తుందని వ్యవసాయ నిపుణులు వివరించారు. ముఖ్యంగా కూరగాయలు, ఆకుకూరల సాగులో పంట అవసరాలకు అనుగుణంగా నీటిని అందించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని సూక్ష్మ సేద్య పద్ధతులను అవలంబించడం, పంటల అవసరాలకు అనుగుణంగా నీటి యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా సాగును మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు.రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర స్థాయి వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలు గ్రామస్థాయిలోని రైతులకు చేరువవుతున్నాయి. పంటల సాగు, నీటి యాజమాన్యం, వాతావరణ మార్పులు, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి. రైతులు తమ వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా నిపుణుల సూచనలు తీసుకోవడం ద్వారా సాగులో తగిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, డిఆర్డిఓ పిడి చిన్న ఓబులేష్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి, వ్యవసాయ శాఖ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

విద్యార్థినుల హాజరు శాతం, ఉపాధ్యాయుల హాజరుపై ఆరా
పౌష్టికాహార నాణ్యతను పరిశీలించిన కలెక్టర్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దసరా సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలకు తిరిగి హాజరైన విద్యార్థినుల విద్యాభ్యాసం, పాఠశాలలో బోధన, విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాల పరిస్థితిని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు.ఈ సందర్భంగా కేజీబీవీ పాఠశాలకు హాజరైన విద్యార్థినులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్నారు. సెలవుల అనంతరం



పాఠశాలకు వచ్చిన విద్యార్థినుల హాజరు పరిస్థితిని పరిశీలించడంతో పాటు, పాఠశాలలో విద్యాబోధనకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు.అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థినుల హాజరు వివరాలను తెలుసుకుని పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడంలో పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల క్రమబద్ధమైన హాజరు కీలకమనే అంశాల నేపథ్యంలో తనిఖీ చేపట్టారు.అలాగే విద్యార్థినులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భోజనానికి సంబంధించిన వివరాలను తెలుసుకుని, విద్యార్థినులకు అందిస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలికలకు విద్యతో పాటు ఆరోగ్యం, పోషకాహారం, అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు.కేజీబీవీ పాఠశాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినుల హాజరు నుంచి వారికి అందించే పౌష్టికాహారం వరకు పలు అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

వైభవ్‌కు ఇచ్చిన ఆ చాక్లెట్ పనిచేసింది: మాజీ క్రికెటర్ ఆసక్తికర వ్యాఖ్య

"ఒక కుర్రాడికి బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ ఇవ్వడం ఓ 'చాక్లెట్' ఇచ్చినట్టు".. ఓ మాజీ క్రికెటర్ చేసిన వ్యాఖ్య ఇది. ఆ చాక్లెట్‌ను 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఎంతలా ఆస్వాదించాడంటే.. న్యూజిలాండ్ బౌలింగ్‌ను చీల్చి చెండాడి, టీమిండియాకు టీ20 సిరీస్‌నే బహుమతిగా అందించాడు! మునుపటి మ్యాచ్‌లో విఫలమైనప్పటికీ, అతడిపై నమ్మకముంచి తిరిగి ఓపెనర్‌గా పంపాలన్న టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహం అద్భుతంగా ఫలించింది. ఆ నమ్మకానికి వందకు వంద శాతం న్యాయం చేస్తూ వైభవ్ ఆడిన తీరు, రాబోయే తరానికి తానొక పెద్ద హామీ అని నిరూపించింది.

'చాక్లెట్' వ్యాఖ్య వెనుక..

భారత మాజీ ఓపెనర్ సదాగోపన్ రమేశ్ ఈ ఆసక్తికర వ్యాఖ్య చేశాడు. "గత మ్యాచ్‌లో మూడో స్థానంలో విఫలమైన వైభవ్‌ను, కోచ్ గంభీర్ తిరిగి ఓపెనర్‌గా పంపడం అతడికి ఓ చాక్లెట్ ఇచ్చినట్లే. వారాంతం వస్తుందనగా శుక్రవారం సాయంత్రం స్కూల్ పిల్లాడు ఎలాంటి సంబరంతో, స్వేచ్ఛతో ఆడతాడో.. వైభవ్ బ్యాటింగ్‌లో అదే కనిపించింది. అతనిపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చేశారు" అని రమేశ్ ప్రశంసల వర్షం కురిపించాడు.

మైదానంలో విధ్వంసం..

వెల్లింగ్‌టన్ వేదికగా 199 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత ఇన్నింగ్స్‌ను వైభవ్, అభిషేక్ శర్మలు ఆరంభించిన తీరు కనీవినీ ఎరుగనిది. ముఖ్యంగా, వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఎదుర్కొన్న 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 45 పరుగులు చేసి, 236.84 స్ట్రైక్ రేట్‌తో కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఒకవైపు అతడు మెరుపులు మెరిపిస్తుంటే, మరో ఎండ్‌లో అభిషేక్ శర్మ (51 బంతుల్లో 113) సెంచరీతో కదం తొక్కాడు. వీరిద్దరూ కలిసి కేవలం 7.1 ఓవర్లలోనే 133 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశారు. పవర్‌ప్లేలో భారత్ వికెట్ నష్టపోకుండా 118 పరుగులు చేసిందంటే వీరి విధ్వంసం ఏ స్థాయిలో



ఉందో అర్థం చేసుకోవచ్చు.ఈ రికార్డు భాగస్వామ్యంతో న్యూజిలాండ్ నిర్దేశించిన భారీ లక్ష్యం చిన్నబోయింది. భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0తో కైవసం చేసుకుంది. టీమ్ మేనేజ్‌మెంట్ పెట్టిన నమ్మకాన్ని నిలబెడుతూ, ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని యువ సంచలనం వైభవ్ కొట్టిన దెబ్బకు కివీస్ బౌలర్లు కోలుకోలేకపోయారు.

ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బిఎస్పీ డిమాండ్

ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం.. పార్టీ తరఫున రూ.5వేలు విరాళం

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు గత 15 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెకు బహుజన్ సమాజ్ పార్టీ(బిఎస్పీ) సంఘీభావం తెలిపింది. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పార్టీ తరఫున రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్, బిజినపల్లి మండల అధ్యక్షులు పానుగంటి రాంచందర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ముగ్గురు ప్రజాప్రతినిధులు వైద్య వృత్తికి చెందినవారేనని గుర్తుచేశారు. ప్రస్తుత నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ,నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డిలు చొరవ తీసుకుని ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ముగ్గురు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి,



ముఖ్యంగా ఎన్హెచ్ఎం ఉద్యోగుల ఉద్యోగ భద్రత, వేతనాలు, మహిళా ఉద్యోగుల ప్రసూతి సెలవులు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఎన్హెచ్ఎం ఉద్యోగులు రెగ్యులర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. అలాంటప్పుడు తెలంగాణలో పనిచేస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు కల్పించకపోవడం పట్ల వారు తీవ్రంగా మండిపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో నెలకు కేవలం రూ.7,000 వేతనంతో ఉద్యోగుల చేత పనిచేయించుకోవడం దుర్మార్గమని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు వెలువరించిన సమాన పనికి సమాన వేతనం అనే సూత్రానికి అనుగుణంగా ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నాయకులు అన్నారు. అయితే, ఆచరణలో ఈ సూత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు.ఎన్హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, వారికి తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, మహిళా ఉద్యోగులకు చట్టబద్ధమైన సెలవులు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి బహుజన్ సమాజ్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ నాయకులు కాకునూరి మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వికాసానికి ఆచరణాత్మక బోధనే ముఖ్యం

కేజీబీవీలో మౌలిక వసతులు కల్పిస్తాం

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్,మన ప్రజాపక్షం:
విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా,నిత్యజీవిత అనుభవాలతో అనుసంధానం చేసుకొని నేర్చుకునేలా ఆచరణాత్మక బోధన అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.మంగళవారం కుంటాల మండలం కల్లూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు.వసతి గృహ ప్రాంగణంలో ప్రతిరోజూ మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని పూటలా నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం వందకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహంలోని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.4.80 లక్షలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. డ్రైనేజీ నిర్మాణంతో పాటు అవసరమైన ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోతుల బెడద నివారణకు సోలార్ కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు. తరగతి గదుల్లో విద్యార్థుల అవసరాన్ని బట్టి ప్రాధాన్యత క్రమంలో బెంచీలు సమకూరుస్తామని పేర్కొన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. వారి చదువు, విద్యా ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జీవశాస్త్రంలోని ఒక అంశాన్ని స్వయంగా బోధించి, విద్యార్థులను ప్రశ్నలు అడుగుతూ వారి అవగాహనను పరిశీలించారు.పాఠ్యాంశాలను నిత్యజీవితంలోని అంశాలతో అనుసంధానం చేసుకొని చదివితే విషయ పరిజ్ఞానం మరింత మెరుగుపడుతుందని విద్యార్థులకు సూచించారు. వివిధ రకాల కూరగాయలను తెప్పించి వాటి బరువును విద్యార్థులతో ముందుగా అంచనా వేయించారు. అనంతరం తూనిక యంత్రంతో బరువును కొలిపించి సరైన అంచనా వేసిన విద్యార్థులను అభినందించారు. వారికి పెన్నులను బహుమతులుగా అందించారు.నిత్యజీవితంలోని చిన్న చిన్న అంశాల నుంచి కూడా విజ్ఞానాన్ని పొందాలని సూచించారు.ఈ తనిఖీల్లో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీఓ శోభన, ఎంఈఓ ముత్యం, సర్పంచ్ దశరథ్, సర్వే అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత్ బచ్పన్ అభియాన్–ఏ పాన్ ఇండియా స్కూల్ అవగాహన సదస్సు

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నాడు నాగర్ కర్నూల్ పట్టణంలోని గవర్నమెంట్ ఉన్నత పాఠశాల నందు సురక్షిత్ బచ్పన్ అభియాన్ –ఏ పాన్ ఇండియా స్కూల్ అవేర్నెస్ క్యాంపెయిన్ గురించి విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శృతి దూత ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ నాగర్ కర్నూల్ హాజరై మాట్లాడుతూ సురక్షిత్ బచ్పన్ అభియాన్ అనేది భారతదేశంలో పిల్లల రక్షణ, హక్కులు మరియు వారి భద్రతను పెంపొందించడం కోసం ఉద్దేశించిన ఒక ముఖ్యమైన కార్యక్రమం అన్నారు. 6 సంవత్సరాల వయస్సు నుంచి 14 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న బాల,బాలికలు అందరూ తప్పనిసరిగా పాఠశాలకు వెళ్ళి చదువుకోవాలి అన్నారు. చిన్న పిల్లలపై జరిగే లైంగిక



దాడులు, వేధింపులను అడ్డుకోవడం కోసం ఏర్పాటైన (పోక్సో) చట్టంపై పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రతి బిడ్డకు స్వేచ్ఛగా చదువుకునే, ఆడుకునే సురక్షితమైన వాతావరణాన్ని అందించడం. పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ గురించి వివరించడం



జరిగింది.ఈ సందర్భంగా బాలల రక్షణ కు సంబంధించిన పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో శ్రీరామ్ ఆర్య ప్రభుత్వ లాయర్, శ్రీశైలం గౌడ్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రాంజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ల పనితీరు,కేసుల పరిష్కారం, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

వార్షిక తనిఖీల్లో భాగంగా మహబూబ్‌నగర్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్, మన ప్రజాపక్షం:
మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం, కేసుల దర్యాప్తు మరియు పరిష్కారంలో వేగం పెంచడం, పోలీస్ స్టేషన్ల పనితీరును మెరుగుపరచడం లక్ష్యంగా వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ డి.జానకి మహబూబ్‌నగర్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించాల్సిన రికార్డులు, రిజిస్టర్లు, పరిపాలనా పత్రాలతో పాటు డీఎస్పీ పరిధిలోని కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల స్థితిగతులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు.డీఎస్పీ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది విధుల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, సిబ్బంది పనితీరుపై అజమాయిషీ కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. నమోదైన కేసుల దర్యాప్తును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు.అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించాల్సిన రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించి, క్రమబద్ధంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పోలీస్ శాఖకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్స్‌లో నమోదు చేయాల్సిన వివరాలు, కేసుల పురోగతి, ఇతర సమాచారాన్ని నిర్దిష్ట గడువులోగా తప్పనిసరిగా పొందుపరచాలని, డేటా నమోదు విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలు పోలీస్ స్టేషన్లకు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని, ఫిర్యాదుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా విధులు నిర్వర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అలాగే పోలీస్ స్టేషన్లలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, కోర్టు సంబంధిత కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ అధికారులకు సూచించారు.వార్షిక తనిఖీల ద్వారా కార్యాలయాల పనితీరును సమీక్షించి, లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడంతో పాటు పోలీస్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.ఈ తనిఖీ సందర్భంగా అందరూ సీఐలు మరియు ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శిగా అంకూరి విజయ్ కుమార్



ఉప్పునుంతల,మన ప్రజాపక్షం:
మూఢనమ్మకాల నిర్మూలన, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం, సమాజంలో సామాజిక చైతన్యం తీసుకురావడం లక్ష్యంగా పనిచేస్తున్న మూఢనమ్మకాల నిర్మూలన సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం జప్తి సదగోడు గ్రామానికి చెందిన అంకూరి విజయ్ కుమార్ జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమితులయ్యారుసంఘం తరఫున జారీ చేసిన డా.బైరి నరేష్,సుజాత అధ్యక్షతన నియామక పత్రం ద్వారా ఈ నియామకం చేపట్టారు. ఇకపై జిల్లా స్థాయిలో సంఘం ఆశయాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, మూఢనమ్మకాల నిర్మూలనకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల ప్రచారంలో కీలక పాత్ర పోషించనున్నారు.ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండి, ప్రతి విషయాన్ని శాస్త్రీయంగా, హేతుబద్ధంగా ఆలోచించాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సంఘం లక్ష్యంగా పెట్టుకుంది. కులమత భేదాలకు అతీతంగా సమానత్వ భావనను పెంపొందిస్తూ, శాస్త్రీయ ఆలోచనలతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయడం తమ ప్రధాన ఉద్దేశమని సంఘం పేర్కొంది.ఈ సందర్భంగా అంకూరి విజయ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ప్రచార కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన సంఘం నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ఆశయాలకు అనుగుణంగా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు, మూఢనమ్మకాల నిర్మూలనకు, సామాజిక చైతన్యం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని వారు తెలిపారు.



పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయండి

కోటపల్లి,మన ప్రజాపక్షం:
ఈ నెల 30న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన చెన్నూర్ నియోజకవర్గం ఇంచార్జ్ కేదాను గీత పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కేంద్రంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. సభకు కోటపల్లి మండలం నుంచి సుమారు వెయ్యి మంది రైతులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఇంద్రవెల్లి సభ ఇన్చార్జి మంచి రెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి, మేడి రాజశేఖర్,వడ్లకొండ రాజేష్,చిట్యాల నరేష్,ధరావత్ రాజేష్,ఎస్.కె సమీర్,శిరీష, సుమలత తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతుల సమన్వయంతో రీ-సర్వే పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్,మన ప్రజాపక్షం:
రైతులను సమన్వయం చేసుకుంటూ భూముల రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం కుంటాల మండలం రాజాపూర్ తాండలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో చేపడుతున్న సర్వే పురోగతిని, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల హద్దుల నిర్ధారణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి సర్వే చేపట్టాలని సూచించారు. సర్వే ప్రక్రియలో రైతులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, వారి సమన్వయంతో పనులు చేపట్టాలని అన్నారు. సర్వే సమయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రీ-సర్వే పనులను మరింత సులభతరం చేసి వేగవంతం చేసేందుకు త్వరలో అదనంగా ఆధునిక సర్వే పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సర్వే సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో తహసీల్దార్ కమల్ సింగ్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





అచ్చంపేటలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం

పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా

రక్తదానం చేసిన యువత, విద్యార్థులు

అచ్చంపేట,మన ప్రజాపక్షం:

పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా అచ్చంపేట సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అచ్చంపేట సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాపాయం ఎదురయ్యే రోగులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతులైన యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.“అన్ని దానాల్లో రక్తదానం గొప్పది” అనే సందేశంతో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్ఐ నరేష్‌తో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ వద్ద వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కోసం రాస్తారోకో

తిరుమలగిరి,మన ప్రజాపక్షం:

తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు దగ్గరలో ఉన్న వ్యవసాయ మార్కెట్ ముందు రైతులు రాస్తారోకో నిర్వహించారు.బుధవారం నాడు రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర రావాలని, గిట్టుబాటు ధర రాకపోవడంతో తాము రోడ్డెక్కి ఆందోళన చేయవలసి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.గత వారం రోజుల నుండి 3,400 మద్దతు ధర రాగ సోమ,మంగళవారం నాడు ఒకేసారి 2,800 తగ్గించడంలో రైతులు ఆందోళన చేశారు. రైతులకు కమిషన్ దారులు, వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి అధిక ధరకు రావలసిన వరి ధాన్యాన్ని తక్కువ ధరలకు కొనాలని చూశారని రైతులు తెలిపారు.గత వారం నుండి వచ్చిన ధరను ఇవ్వమని అడిగామని,ధర తగ్గించి 2,800కు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అందుకే రైతులు రోడ్డు ఎక్కవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. రాస్తారోకో వల్ల గంటసేపు వాహనాలు ఒక కిలోమీటర్ వరకు నిలిచిపోయాయి. వెంటనే స్థానిక ఎస్ఐ జి.వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నాగారం సీఐ నాగేశ్వరరావు రైతులను సముదాయించి రాస్తారోకోను విరమింప చేశారు.



మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

సూర్యాపేట,మన ప్రజాపక్షం:

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా అటవీ శాఖ అధికారి కె.దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ జీఎంఆర్ టౌన్‌షిప్‌లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాధితో కలిసి ఆయన మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను కాపాడుకోవాలని సూచించారు. చెట్ల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడటంతోపాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు రుద్రంగి కాళిదాస్, ప్రధాన కార్యదర్శి తిరుమల్ రెడ్డి, చైర్మన్ రామ్ కుమార్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ఉప్పల నాగయ్య, నజీర్ బాషా, టౌన్‌షిప్ అధ్యక్షుడు రామలింగారెడ్డి, జీఎంఆర్ టౌన్‌షిప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేట్టభద్రులు ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలి

సూర్యాపేట, మన ప్రజాపక్షం:ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, పట్టభద్రుల శాసనమండలి స్థానానికి త్వరలో జరగనున్న ఎన్నికకు పట్టభద్రులు ప్రతి ఒక్కరూ నవంబర్ ఆరో తారీకులోగా విధిగా ఓటును నమోదు చేసుకోవాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కుందూరు దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కుడ రోడ్ లో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో స్టాల్స్ ను ఏర్పాటు చేసి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థిగా విద్యావంతులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ పోటీ చేస్తున్నారని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. టిఆర్ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పాంచ జన్య అంశాలైన ఉపాధి, ఉచిత వైద్యం, ఉచిత విద్య, వ్యవసాయం, సామాజిక న్యాయం, అంశాలతో రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. పట్టణంతో పాటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో పట్టబద్ధుల హెల్ప్ డెస్క్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా పంటలు ఎండిపోయి రైతన్నలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, వరి ధాన్యానికి మద్దతు ధర క్వింటాలుకు రు. 5 వేలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మామిళ్ళపల్లి ఉమారాణి, యూత్ విభాగం అధ్యక్షులు వీరగాని సాయి



చందన్ గౌడ్, జిల్లా నాయకులు ఉప్పల చారి, సైదిరెడ్డి,కారింగుల శ్రీనివాస్ గౌడ్, ధరావత్ కృష్ణ నాయక్, గజవెల్లి గీత, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరపై

పూర్తి అధికారం యాదవులకే కల్పించాలి

పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలి

సూర్యాపేట,మన ప్రజాపక్షం:యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించి, జాతర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, భక్తుల సౌకర్యాల కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంగళవారం నాడు తగుళ్ళ జనార్దన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, బీసీ రాష్ట్ర నాయకులు వట్టే జానయ్య యాదవ్ విచ్చేసి మాట్లాడారు.పెద్దగట్టు జాతర నిర్వహణకు ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి, జాతర ప్రాముఖ్యతను గుర్తించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని, జాతర నిర్వహణకు సంబంధించిన అన్ని కీలక నిర్ణయాలు, పరిపాలనా బాధ్యతలు యాదవుల చేతుల్లోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముఖ్య అతిథులు అన్నారు.పెద్దగట్టు జాతర కేవలం ఒక ప్రాంతీయ ఉత్సవం మాత్రమే కాదని, యాదవుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సంప్రదాయాలకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని సమావేశం అభిప్రాయపడింది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన జాతరకు ఆరు రాష్ట్రాల నుండి 30, 40 లక్షల మంది పాల్గొనే ఈ యొక్క జాతరను రాష్ట్ర పండుగ హోదా కల్పించడంతో పాటు, తగిన బడ్జెట్ కేటాయించి శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని వారు అన్నారు.రాష్ట్ర



ప్రభుత్వం ఈ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, పెద్దగట్టు జాతర అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. యాదవుల ఆరాధ్య దైవమైన లింగమంతుల స్వామి జాతర గౌరవాన్ని మరింత పెంచేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని నాయకులు కోరారు.యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరపై ఇతరుల పెత్తనాలు ఇకనైనా ఆగాలని, జాతర నిర్వహణలో యాదవులకే పూర్తి అధికారాలు, నిర్ణయాధికారం కల్పించాలని, ఈ యొక్క సమావేశంలో పాల్గొన్న వారు అందరూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. యాదవులను కేవలం పేరుకే చైర్మన్లుగా నియమించి, అసలు పెత్తనం, కీలక నిర్ణయాలు ఇతరుల చేతుల్లో పెట్టే విధానాన్ని తక్షణమే మార్చాలని సమావేశం స్పష్టం చేసింది.యాదవుల ఓట్లు కావాలి, యాదవుల మద్దతు కావాలి, కానీ యాదవుల ఆరాధ్య దైవం జాతర నిర్వహణలో మాత్రం యాదవులకు పూర్తి అధికారం ఇవ్వకపోవడం ఏ విధమైన న్యాయమని యాదవ నాయకులు ప్రశ్నించారు.పెద్దగట్టు జాతరపై యాదవుల హక్కులు, అధికారాల విషయంలో ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించకపోతే, రాబోయే ఎన్నికల్లో ఆయా పార్టీలకు యాదవుల ఓట్లు దక్కకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయ చైతన్యం తీసుకొస్తామని సమావేశంలో పాల్గొన్న యాదవులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వజ్జే వీరయ్య యాదవ్, మతకాల చలపతి రావు యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్, వల్లాల అచ్చయ్య పరంధాములు యాదవ్, యాదవ్ నారబోయిన వెంకట్ యాదవ్, దాసరి వెంకన్న యాదవ్, మన్నె యాదగిరి యాదవ్, తూముల వెంకన్న యాదవ్, బయ్య మల్లికార్జున్ యాదవ్, ముద్ద బిక్షపతి యాదవ్, బడుగుల నాగార్జున యాదవ్, ఆవుల అంజయ్య యాదవ్, ఉప్పుల రమేష్ యాదవ్, వర్రె కవిత యాదవ్, కోడి లింగయ్య యాదవ్, ఏర్పుల రవి యాదవ్, కన్నెబోయిన మహేష్ యాదవ్, ఆవుదొడ్డి మహేష్ యాదవ్, గోళ్ళ మల్లికార్జున్ యాదవ్, వల్లపు నరేష్ యాదవ్, మద్ది జానకి రాములు యాదవ్, పచ్చిపాల మల్లేష్ యాదవ్, గంధం లింగయ్య యాదవ్, మల్లికార్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పూసల మాలలు అల్లితే 1,500 ఇస్తామంటూ మోసం

‘వందన్ క్రాఫ్ట్స్’ పేరుతో వసూళ్లు..

సుమారు రూ.9 లక్షలు నష్టపోయిన బాధితులు

వరంగల్, అక్టోబర్ 27 పూసలతో మాలలు అల్లితే వారానికి రూ.1,500 అదనంగా చెల్లిస్తామంటూ వరంగల్‌లో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. అయ్యప్ప, తులసి, కరుంగళి మాలల తయారీ పేరుతో ఏర్పాటు చేసిన సంస్థను నమ్మి నగరంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు డబ్బులు కోల్పోయినట్లు సమాచారం.వందన్ క్రాఫ్ట్స్ పేరుతో మల్లికార్జున్ అనే వ్యక్తి జూలైలో వరంగల్‌లోని దేశాయిపేట రోడ్డులో కార్యాలయం ఏర్పాటు చేసినట్లు కథనం పేర్కొంది. పూసల ప్యాకెట్ తీసుకునేందుకు ముందుగా రూ.5,000 డిపాజిట్ చేయాలని, పూసలతో మాలలు అల్లి వారం తర్వాత తిరిగి ఇస్తే డిపాజిట్ మొత్తంతో పాటు అదనంగా రూ.1,500 చెల్లిస్తామని నమ్మించినట్లు బాధితులు చెబుతున్నారు.మొదట కొందరికి డబ్బులు చెల్లించడంతో సంస్థపై నమ్మకం పెరిగింది. దీంతో పలువురు ఒక్కొక్కరు రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు డిపాజిట్ చేసి ప్యాకెట్లు తీసుకున్నట్లు సమాచారం. వరంగల్‌తో పాటు ములుగు, పరకాల, మహబూబాబాద్ ప్రాంతాల ప్రజలు కూడా ఈ పథకంలో చేరినట్లు తెలుస్తోంది.అయితే, అక్టోబర్ 7న



కార్యాలయాన్ని మూసివేయడంతో బాధితులు మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటివరకు సుమారు 100 మంది బాధితులను గుర్తించామని, అధికారికంగా రూ.9 లక్షల వరకు మోసం జరిగినట్లు గుర్తించామని ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ సీఐ షుకూర్ తెలిపినట్లు కథనం పేర్కొంది. బాధితులందరూ ముందుకు వస్తే నష్టపోయిన మొత్తం మరింత స్పష్టమవుతుందని పోలీసులు వెల్లడించారు.ప్రజలకు సూచన: తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయనే హామీలను నమ్మి డిపాజిట్లు చెల్లించే ముందు సంస్థ విశ్వసనీయతను పరిశీలించాలి. మోసానికి గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

విద్యతో పాటు క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రతి విద్యార్థిని ఏదో ఒక క్రీడలో నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, మన ప్రజాపక్షం:
విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో పీఎం శ్రీ పాఠశాలలు - విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సిడబ్ల్యూఎస్ఎన్ (ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు) 2026-27 ఆటలు, క్రీడా పోటీల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరై, ఆటలు, క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనసులో ఆందోళనలు, బాధలు ఉన్నప్పుడు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉపశమనం పొందవచ్చని, ఆటలు, క్రీడలు ఆడటం ద్వారా ఉత్సాహంగా, సానుకూల దృక్పథంతో పనులు చేయగలుగుతారని పేర్కొన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తాయని, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. చిన్న వయసు నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని, వారి కృషి ఫలితంగానే జనగామ జిల్లా విద్యా రంగంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 3,000 మంది విద్యార్థులు అదనంగా చేరడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా, క్రీడా సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా చెస్ ఆడటం వల్ల ఆలోచనా సామర్థ్యం, గణిత నైపుణ్యాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం మెరుగుపడతాయని వివరించారు. టేబుల్ టెన్నిస్ వంటి క్రీడలు ఏకాగ్రత, వేగంగా స్పందించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే భవిష్యత్తులో పారా ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు వంటి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలు ఉంటాయని వెల్లడించారు.తల్లిదండ్రులు తమ పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయకుండా, కనీసం ఒక క్రీడలోనైనా నైపుణ్యం సాధించేలా ప్రోత్సహించాలని కోరారు. చదువుకు ఇచ్చే ప్రాధాన్యతతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే తత్వం, సమానత్వ భావన, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. ఇవి విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని వివరించారు.ఈ జిల్లా స్థాయి క్రీడా కార్యక్రమంలో విద్యార్థులు ఇండోర్, అవుట్ డోర్ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని, తమలోని ప్రతిభను వెలికితీయాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకుని, క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, ఎస్జీఎఫ్ కార్యదర్శి గోర్ సింగ్, సీఎంఓ యాదగిరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి

కేజీబీవీ బచ్చన్నపేటలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా







జనగామ, మన ప్రజాపక్షం:
విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం జిల్లాలోని బచ్చన్నపేట మండల పరిధిలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యా బోధన తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వంట గదిని సందర్శించి, విద్యార్థుల కోసం ఏయే వంటకాలు తయారు చేస్తున్నారని వంట సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంకాయ కూర, పప్పు, అన్నం వండుతున్నామని వంట సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. అలాగే ఆ రోజు భోజన మెనూలో ఏయే వంటకాలు ఉన్నాయని ప్రశ్నిస్తూ, పాఠశాలలో ఏర్పాటు చేసిన మెనూ చార్ట్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అనే విషయాలను తెలుసుకున్నారు. భోజనం అనంతరం విద్యార్థులకు పెరుగు అందిస్తున్నారా? అని కూడా ఆరా తీశారు.పాఠశాలలోని మూత్రశాలలను పరిశీలించి, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. అదే విధంగా సరుకుల నిల్వ గదిని సందర్శించి, విద్యార్థులకు అవసరమైన సరుకుల నిల్వ, వాటి నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.అనంతరం ఇంటర్మీడియట్ తరగతి గదిని సందర్శించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, గణితంలోని నిరూపక రేఖాగణితం అంశంపై ప్రశ్నలు అడిగి, వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు.పదో తరగతి విద్యార్థులతోనూ కలెక్టర్ మాట్లాడి, చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా క్రమం తప్పకుండా చదవాలని సూచించారు. గణితంలో వేగంగా లెక్కలు చేయడంపై (ఫాస్ట్ మ్యాథ్స్) విద్యార్థులను ప్రశ్నించారు. అన్ అకాడమీ ద్వారా ఆన్‌లైన్‌లో పాఠాలు నేర్చుకుంటున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు ఎన్ని అధ్యాయాలు పూర్తి చేశారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అలాగే గెట్ ఇట్ రైట్ పుస్తకంలో ఎన్ని అధ్యాయాలు పూర్తిచేశారనే వివరాలపై కూడా ఉపాధ్యాయులను ఆరా తీశారు. అధ్యాయాల వారీగా విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు.పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు.ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీపై అవగాహన ప్రచారానికి 'స్వేచ్ఛా రథం' ప్రారంభం

బాధితులను గుర్తించి, రక్షించి, పునరావాసం కల్పించాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ,మన ప్రజాపక్షం:
వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో వెట్టిచాకిరీపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమంలో భాగంగా రూపొందించిన 'స్వేచ్ఛా రథం' ను కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 080-69434343 గురించి విస్తృతంగా ప్రచారం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ ప్రచార వాహనం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ వ్యవసాయం, ఇటుక బట్టీలు, జలవనరుల పెంపకం, గనులు, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు వారి హక్కులు, వెట్టిచాకిరీ గుర్తింపు, ఫిర్యాదు విధానాలపై అవగాహన కల్పిస్తుందని తెలిపారు.వెట్టిచాకిరీ ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడు అధికారులు తక్షణమే స్పందించి, బాధితులకు రక్షణ, పునరావాసం, అవసరమైన సహాయం అందించాలని స్పష్టం చేశారు.ప్రజలకు బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా అనుమానిత వెట్టిచాకిరీ ఘటనలను నివేదించేందుకు, బాధిత కార్మికులను వారికి అందుబాటులో ఉన్న రక్షణ, సహాయ వ్యవస్థలతో అనుసంధానించేందుకు 'స్వేచ్ఛా రథం' ప్రచారం దోహదపడుతుందని వెల్లడించారు. అదే విధంగా బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి కుమారస్వామి, డీఎంహెచ్ఓ వాణి శ్రీ, స్కోప్ ఎన్జీఓ జీ. మనోజ్ కుమార్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



డిఎస్సి -2024 ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రకటించాలి

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
డిఎస్సి - 2024 ద్వారా నియామకమైన ఉపాధ్యాయుల వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, అదేవిదంగా డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని,ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ డీఈఓ రమేష్ కుమార్ కు ఎస్టియూ ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రమేష్, రాష్ట్ర కార్యదర్శి ఎం. అనిల్ కుమార్ రెడ్డి,జిల్లా నాయకులు మల్లయ్య, నరసింహ, తాడూరు మండల అధ్యక్షులు కె. సురేష్ బాబు, బిజినపల్లి మండల అధ్యక్షులు శేఖర్, వెంకట్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.



స్టేడియంలో అవసరమైన మరమ్మతులు చేపట్టి, పరిశుభ్రంగా ఉంచాలి

ఇండోర్ స్టేడియంలో క్రీడా పరికరాల పరిశీలన

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, మన ప్రజాపక్షం:
క్రీడాకారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, క్రీడా పరికరాలను సరైన విధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, అక్కడి ఇండోర్ స్టేడియంలో అందుబాటులో ఉన్న క్రీడా సౌకర్యాలు, పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఇందులో భాగంగా బ్యాడ్మింటన్ కోర్టు, జిమ్‌లోని పరికరాలు, డంబెల్స్, తదితర క్రీడా సామగ్రిని పరిశీలించి, వాటి నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్టేడియంలో అవసరమైన మరమ్మతులను వెంటనే చేపట్టాలని సూచించారు. పాడైపోయిన తలుపు స్థానంలో కొత్త తలుపును ఏర్పాటు చేయాలని, స్టేడియంలో ఉన్న క్రీడా పరికరాలన్నింటినీ క్రమపద్ధతిలో సరిగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే, ఇండోర్ స్టేడియాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, క్రీడా పరికరాల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, స్టేడియంలో సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, ఎస్జీఎఫ్ కార్యదర్శి గోర్ సింగ్, సీఎంఓ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



అక్టోబర్ 28, 29 తేదీల్లో మార్కెట్ యార్డుకు సెలవు

జనగామ, మన ప్రజాపక్షం:
జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో అధిక మొత్తంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వలు ఉండటం, మార్కెట్ యార్డు సామర్థ్యం 50 వేల బస్తాలకు చేరుకోవడం, ఇప్పటికే వచ్చిన ఉత్పత్తుల్లో అధిక మొత్తంలో అన్‌లోడింగ్ కాకుండా ఉండటంతో పాటు, మార్కెట్ యార్డులో స్థలం లేకపోవడం వల్ల బయట సుమారు 10 వేల బస్తాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నేపథ్యంలో అక్టోబర్ 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు వెల్లడించారు.కావున రైతులు, సంబంధిత భాగస్వాములందరూ ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

చేనేత కార్మికుల నేత కూళ్ళు పెంచాలి:వనం శాంతి కుమార్

పెరిగిన నిత్యావసరాల ధరలతో తీవ్ర ఇబ్బందులు
దీపావళి లోపు సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదు





అక్టోబర్ 27,

తెలంగాణ బ్యూరో: దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినందున చేనేత కార్మికులకు నేత కూళ్ళు వెంటనే పెంచాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ మాస్టర్ వీవర్లకు విజ్ఞప్తి చేశారు. ఆటోనగర్‌లోని కర్నాటి గార్డెన్స్‌లో ఎల్బీనగర్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు చెరుకు స్వామి అధ్యక్షతన, నేత టీవీ సౌజన్యంతో రంగారెడ్డి జిల్లా చేనేత కార్మికుల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వనం శాంతి కుమార్ మాట్లాడుతూ, కరోనా కంటే ముందు పెంచిన నేత కూళ్లను గత ఐదేళ్లుగా పెంచకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం పుట్టపాక, గట్టుప్పల్, చండూరు ప్రాంతాల్లో ప్రస్తుత కూళ్లపై కనీసం 15 నుంచి 20 శాతం వరకు పెంచాలని, పోచంపల్లిలో గతంలో ఉన్న కూళ్లపై రూ.3,000 అదనంగా పెంచి ఇవ్వాలని కార్మికులు నిర్ణయించారని తెలిపారు. నేత కూళ్ళ పెంపు కోసం ప్రాంతాలవారీగా కమిటీలను ఏర్పాటు చేశామని, మాస్టర్ వీవర్లకు సంఘం తరపున లేఖలు రాయనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై ధ్వజం:

రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమ, కార్మికుల సమస్యలను పూర్తిగా గాలికొదిలేసిందని ఆయన మండిపడ్డారు. త్రిఫ్ట్ ఫండ్‌లో కార్మికులు 20 నెలల నుంచి డిపాజిట్ చేస్తున్నా ప్రభుత్వం కేవలం రెండు నెలల వాటా మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు. 'నేతన్న భరోసా' కింద 2024 జనవరి నుంచి ఇవ్వాల్సిన నిధుల్లో కేవలం మూడు నెలల మొత్తం మాత్రమే జమ చేశారని, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించకపోవడంతో ఆగస్టు తర్వాత చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల 'నేతన్న బీమా' అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను ప్రభుత్వం వెంటనే మాఫీ చేయాలని, రైతుల ధాన్యం కొనుగోలు చేసినట్లే సహకార సంఘాలు ఉత్పత్తి చేసిన వస్త్రాలను టెస్కో ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దీపావళి లోపు సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నేత టీవీ ప్రతినిధి రామకృష్ణ బుషి, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బాషాబత్తిని రాజేశం, కోశాధికారి గవ్వల శంకర్, సంఘం ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, సలహాదారులు బడుగు శంకరయ్య, కార్యదర్శి ముషం నరహరి, నాయకులు వర్కాల చంద్రశేఖర్, కర్నాటి వెంకటేశం, పొట్టబత్తిని రమేష్, నామాల వెంకటేష్, దుస్స కుమార్, జెల్ల వెంకటేష్, జెల్ల మారయ్య, మస్న కవిత, వర్కాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తుపాను ఒక్కోసారి దిశ మార్చుకుంటుంది.. అందుకే ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం: సీఎం చంద్రబాబు

"తుపాను ఒక్కోసారి వేగం పుంజుకుంటుంది, ఒక్కోసారి నెమ్మదిస్తుంది, కొన్నిసార్లు అనూహ్యంగా దిశ కూడా మార్చుకుంటుంది. అందుకే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తీవ్ర తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆయన మంగళవారం రాత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఆస్తి నష్టాన్ని నివారించడం రెండో ప్రాధాన్యత అని ఆయన తేల్చి చెప్పారు.ప్రస్తుత తుపానును అత్యంత తీవ్రమైనదిగా వాతావరణ శాఖ వర్గీకరించిందని, దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని చంద్రబాబు తెలిపారు. "తుపాను బుధవారం ఉదయం 5 నుంచి 9 గంటల మధ్య కాకినాడ-యానాం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 140 నుంచి 160 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయొచ్చు. కొన్నిసార్లు గాలి వేగం 180 కిలోమీటర్లకు కూడా చేరవచ్చు. తుపాను తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు కొనసాగుతాయి. కాబట్టి, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దు," అని ఆయన విజ్ఞప్తి చేశారు.



గత అనుభవాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు

ఇలాంటి విపత్తులను ఎదుర్కోవడం తనకు కొత్తేమీ కాదని చెబుతూ, ముఖ్యమంత్రిగా తన సుదీర్ఘ అనుభవాలను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా 1996-97లో తూర్పు గోదావరి జిల్లాను అతలాకుతలం చేసిన పెను తుపాను, హుదూద్ విలయాన్ని ఆయన ప్రస్తావించారు."1996లో వచ్చిన పెను తుపానుకు సుమారు 2,000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ వార్త తెలియగానే హైదరాబాద్ నుంచి బయలుదేరాను. వాతావరణం అనుకూలించకపోయినా, పైలట్లకు ధైర్యం చెప్పి, అండర్‌టేకింగ్ రాసిచ్చి హెలికాప్టర్‌లో విపత్తు ప్రాంతానికి వెళ్లాను. ముమ్మడివరం, అమలాపురంలో దిగి, 'నేనున్నానంటూ' ప్రజలకు భరోసా ఇచ్చాను. తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు వాతావరణం సహకరించకపోవడంతో విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. అక్కడి నుంచే అప్పటి ప్రధానమంత్రి దేవెగౌడ గారికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించి, తక్షణ సాయం కోరాను. ఆ తర్వాత రాజమండ్రినే కేంద్రంగా చేసుకుని, అధికారులను మండలాల వారీగా నియమించి, సహాయక చర్యలు చేపట్టాను. ప్రైవేటు లారీలను సైతం స్వాధీనం చేసుకుని ఎమర్జెన్సీ పనులకు ఉపయోగించాను" అని చంద్రబాబు వివరించారు.అలాగే హుదూద్ తుపాను సమయంలో విశాఖపట్నం నగరం చిగురుటాకులా వణికిపోయిందని, తాను నేరుగా విశాఖ వెళ్లలేక విజయవాడలో దిగి, రోడ్డు మార్గంలో అక్కడికి చేరుకున్నానని తెలిపారు. "వారం రోజుల పాటు అక్కడే ఉండి, నగరాన్ని తిరిగి గాడిన పెట్టే వరకు విశ్రమించలేదు. పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి కూరగాయలు తెప్పించాను. ఆ అనుభవంతోనే భవిష్యత్తులో ఇలాంటి నష్టం జరగకూడదని విశాఖలో అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేశాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ అనుభవాలన్నింటినీ ఉపయోగించి, టెక్నాలజీని జోడించి ప్రస్తుత విపత్తును ఎదుర్కొంటున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రజలకు చంద్రబాబు చేసిన ముఖ్య సూచనలు

తుపాను పూర్తిగా తీరం దాటి, అధికారులు సురక్షితమని చెప్పేవరకు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దు. ముఖ్యంగా తెల్లవారుజామున కాలకృత్యాల కోసం బయటకు వెళ్లే అలవాటును మానుకోవాలి.

అన్ని రకాల ప్రయాణాలను పూర్తిగా రద్దు చేసుకోవాలి.

సెల్‌ఫోన్లు, పవర్‌బ్యాంకులను ముందుగానే ఛార్జ్ చేసి పెట్టుకోవాలి. కొవ్వొత్తులు, నిత్యావసరాలను సిద్ధంగా ఉంచుకోవాలి.

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దు. తమ బోట్లను చూసేందుకు కూడా తీరానికి వెళ్లడం ప్రమాదకరం.

లోతట్టు ప్రాంతాల ప్రజలు, లంక గ్రామాల వారు తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి.

ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్తంభాలు పడితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి.

ప్రభుత్వ యంత్రాంగానికి సంపూర్ణంగా సహకరించాలి. ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని, ఇప్పటికే 84 వేల మందికి పైగా ప్రజలను 2,199 పునరావాస కేంద్రాలకు తరలించామని చంద్రబాబు తెలిపారు. 12 ఎన్డీఆర్ఎఫ్, 10 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు నేవీ, కోస్ట్‌గార్డ్, పోలీస్, అగ్నిమాపక దళాలు క్షేత్రస్థాయిలో ఉన్నాయని చెప్పారు. వైద్య బృందాలు, అత్యవసర మందులు, విద్యుత్ పునరుద్ధరణ సిబ్బంది, తాగునీటి ట్యాంకర్లు, జనరేటర్లను సిద్ధం చేశామన్నారు. "నేను రాత్రంతా పరిస్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తాను. ప్రజలు అధైర్యపడొద్దు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

ఏపీ లిక్కర్ స్కామ్: రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట.. ఏపీ ప్రభుత్వానికి చుక్కెదురు

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనకు ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అయితే, విచారణ పూర్తయ్యే వరకు కెసిరెడ్డి దేశం విడిచి వెళ్లరాదని, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని స్పష్టమైన షరతులు విధించింది.ప్రొడక్షన్ వారెంట్ జారీని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అరెస్ట్ చేయబోమని కోర్టులో హామీ ఇచ్చాక కూడా ప్రొడక్షన్ వారెంట్ జారీ చేయడంపై వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పులోని కొన్ని వ్యాఖ్యలతో తాము ఏకీభవించడం లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. అయితే, కేవలం ఆ కారణంతో నిందితుడికి మంజూరు చేసిన బెయిల్‌ను, స్వేచ్ఛను రద్దు చేయలేమని స్పష్టం చేసింది. పోలీసులు నేరుగా చేసే అరెస్ట్‌కు, కోర్టు జారీ చేసే ప్రొడక్షన్ వారెంట్‌కు మధ్య వ్యత్యాసం ఉందని వ్యాఖ్యానించింది.ముందస్తు అనుమతి లేకుండా నిందితుడిని మళ్లీ అరెస్ట్ చేయరాదని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లోని 23వ పేరాను సుప్రీంకోర్టు సమర్థించింది. ఒకవేళ నిందితుడు దర్యాప్తునకు సహకరించని పక్షంలో, బెయిల్ రద్దు కోసం మళ్లీ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పుతో కెసిరెడ్డికి హైకోర్టు ఇచ్చిన బెయిల్ కొనసాగనుంది.





గర్భిణీ జర్నలిస్టును తోశారంటూ పిటిషన్..

రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు నోటీసులు
అక్టోబర్ 12న జరిగిన ఘటనపై మహిళా జర్నలిస్టు ఆరోపణలు..
ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్

అక్టోబర్ 27, సెంట్రల్ డెస్క్:

గర్భిణీ జర్నలిస్టును తోసేశారన్న ఆరోపణలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతరులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది.అక్టోబర్ 12న ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండీ కూటమి నేతలు సుప్రీంకోర్టు వైపు ర్యాలీగా వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాహుల్ గాంధీ తనను గేటు వైపు బలంగా తోశారని, దీంతో తాను కిందపడకుండా చేతులతో ఆసరా తీసుకోవాల్సి వచ్చిందని మహిళా జర్నలిస్టు ఆరోపించారు. ఆ సమయంలో తాను మూడు నెలల గర్భిణీనని, అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు.ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినట్లు కథనం పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.అయితే, రాహుల్ గాంధీ మహిళా జర్నలిస్టును తోశారన్న ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. ఈ ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొంది. ఈ వ్యవహారంపై న్యాయస్థానంలో తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

ఉగాండాలో సీరియల్ కిల్లర్ అరెస్ట్

15 ఏళ్లలో 38 మందిని హత్య చేసినట్లు ఆరోపణలు..
నిందితుడిపై దర్యాప్తు

అక్టోబర్ 27:



ఉగాండాలో వరుస హత్యల కేసులో ముజురిజి మోసెస్ అనే వ్యక్తిని భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. 2010 నుంచి 2025 మధ్య 38 మందిని హత్య చేసి, వారి మృతదేహాలను తిన్నాడనే తీవ్ర ఆరోపణలు అతడిపై ఉన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఉగాండా మిలిటరీ చీఫ్ ముహుజీ వెల్లడించినట్లు కథనాలు పేర్కొన్నాయి.నిందితుడు కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని ఇళ్లలోకి చొరబడి కత్తితో దాడులు చేసినట్లు స్థానికుల ఆరోపణలున్నాయి. అయితే, బాధితుల వివరాలు, ఘటనలకు సంబంధించిన ఆధారాలు, నేరాల వెనుక కారణాలు ఇంకా పూర్తిస్థాయిలో వెల్లడికావాల్సి ఉంది.ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్న భద్రతా అధికారులు తదుపరి దర్యాప్తు చేపడుతున్నట్లు సమాచారం. నిందితుడిపై వచ్చిన ఆరోపణలు న్యాయస్థానంలో నిరూపితం కావాల్సి ఉంది. అరెస్టు, ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులో లేనందున, దర్యాప్తులో వెలువడే వివరాల ఆధారంగా మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచ అగ్రగామిగా ఎదగాలి: ప్రధాని మోదీ


స్వదేశీ సాంకేతికతల్లో స్వయం సమృద్ధి సాధించాలి..
ప్రధాని మోదీ ఆకాంక్ష

దిల్లీ, అక్టోబర్ 27

సైన్స్, సాంకేతిక రంగాల్లో సరికొత్త ఆలోచనలు, అపారమైన ఆత్మవిశ్వాసంతో భారత్ ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన 'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్'ను ఆయన ప్రారంభించారు.భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నూతన సాంకేతికతలను అభివృద్ధి చేయడంతోపాటు, ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయికి భారత్ ఎదగాలని మోదీ ఆకాంక్షించారు. కీలక సాంకేతిక రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం అవసరమని పేర్కొన్నారు.వివిధ రంగాల్లో భారత్ సాధిస్తున్న విజయాలు ప్రశంసనీయమని, దేశంలో తయారైన చిప్‌ల తొలి సరఫరాలు ఇప్పటికే ప్రపంచ దేశాలకు చేరుతున్నాయని తెలిపారు. బ్యాటరీల నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు దేశీయ ముడి పదార్థాల ఆధారంగా వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.అణుశక్తి, అంతరిక్షం, కృత్రిమ మేధ, సెమీకండక్టర్ల వంటి కీలక రంగాల్లో భారత్ తన సామర్థ్యాన్ని పెంచుకుంటోందని ప్రధాని అన్నారు. దేశంలో ఒక సమస్యకు పరిష్కారం కనుగొంటే, అది ప్రపంచంలోని అనేక దేశాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భారత డిజిటల్ సాంకేతికత, 5జీ సేవలు ఇందుకు మంచి ఉదాహరణలని మోదీ వివరించారు.

జాన్వీ కపూర్ కు అండగా నిలిచేందుకు..

లండన్ లో చదువు వదిలేసి వచ్చాడు!



బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ తన ప్రియుడు శిఖర్ పహారియాతో ఉన్న బంధం గురించి తొలిసారిగా మనసు విప్పి మాట్లాడారు. తన తల్లి, దిగ్గజ నటి శ్రీదేవి మరణించిన కష్టకాలంలో శిఖర్ తనకు ఎలా అండగా నిలిచాడో గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించే 'కాఫీ విత్ కరణ్' షోలో నటుడు వరుణ్ ధావన్‌తో కలిసి పాల్గొన్న జాన్వీ, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కీలక విషయాలను పంచుకున్నారు.2018లో శ్రీదేవి ఆకస్మిక మరణం తనను తీవ్రంగా కుంగదీసిందని, ఆ సమయంలో శిఖర్ తన వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి తనకు అండగా నిలిచాడని జాన్వీ వెల్లడించారు. "ఆ సమయంలో శిఖర్ లండన్‌లో చదువుతున్నాడు. నేను ఎదుర్కొంటున్న పరిస్థితిని చూసి, తన చదువును సగం సెమిస్టర్ లోనే వదిలేసి ముంబై వచ్చేశాడు. అప్పుడు మేము డేటింగ్‌లో కూడా లేము. అతను మొదట తన తండ్రితో కలిసి ఉండేవాడు. కానీ నాకు తర్వాత తెలిసిన విషయం ఏంటంటే, అతను నాకోసం జుహులోని ఒక స్నేహితుడి ఇంట్లో నెలరోజుల పాటు ఉన్నాడు. నాకు అవసరం వస్తే అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే అతను అలా చేశాడని నాకు తర్వాత తెలిసింది" అని జాన్వీ గుర్తుచేసుకున్నారు.2018 ఫిబ్రవరి 24న శ్రీదేవి దుబాయ్‌లోని ఓ హోటల్ గదిలోని బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తు మునిగి మరణించిన సంగతి తెలిసిందే. ఈ వార్త యావత్ సినీ పరిశ్రమను, అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. తల్లి మరణంతో జాన్వీ, ఆమె సోదరి ఖుషీ తీవ్రమైన విషాదంలో మునిగిపోయారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో శిఖర్ మద్దతు తనకెంతో ధైర్యాన్నిచ్చిందని జాన్వీ పరోక్షంగా తెలిపారు.జాన్వీ కపూర్, శిఖర్ పహారియా చాలా ఏళ్లుగా ప్రేమలో ఉన్నారని ప్రచారం జరుగుతున్నప్పటికీ, వారిద్దరూ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. అయితే, కుటుంబ కార్యక్రమాల్లో, ఇతర వేడుకల్లో వీరిద్దరూ కలిసే కనిపిస్తుండటంతో ఈ వార్తలకు బలం చేకూరింది. గతంలో ఇదే షోలో తన స్పీడ్ డయల్‌లో ఉన్న ముగ్గురిలో 'షికూ' (శిఖర్ ముద్దుపేరు) ఒకరని జాన్వీ చెప్పడం, తన తండ్రి బోనీ కపూర్ సినిమా 'మైదాన్' స్క్రీనింగ్‌లో శిఖర్ పేరు ఉన్న నెక్లెస్‌తో కనిపించడం వంటివి వారి బంధాన్ని ధృవీకరించాయి. శిఖర్ అంటే తన తండ్రి బోనీ కపూర్‌కు కూడా ఎంతో ఇష్టమని జాన్వీ పలుమార్లు చెప్పారు.

మా ప్లాన్ చాలా సింపుల్..

వైభవ్ తో ఓపెనింగ్ పై అభిషేక్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూజిలాండ్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగి, కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు సాధించి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన తర్వాత, యువ సంచలనం అభిషేక్ శర్మ తన విధ్వంసక ఇన్నింగ్స్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పంచుకున్నాడు. తాను, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడటమే తమ ప్రణాళిక అని, ముఖ్యంగా పవర్‌ప్లేను సద్వినియోగం చేసుకోవాలని ముందే నిర్ణయించుకున్నామని తెలిపాడు. మ్యాచ్ అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న అభిషేక్ తన మనసులోని మాటలను వెల్లడించాడు.న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా వెల్లింగ్‌టన్‌లోని హెన్రీ స్టేడియంలో జరిగిన మూడో టీ20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, అభిషేక్ శర్మ (38 బంతుల్లో 113; 9 ఫోర్లు, 11 సిక్సర్లు) సునామీ సెంచరీతో కేవలం 13.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది.తన ఇన్నింగ్స్ గురించి అభిషేక్ శర్మ మాట్లాడుతూ, "మా ప్లాన్ చాలా సింపుల్. నేను, వైభవ్ స్వేచ్ఛగా, ఆస్వాదిస్తూ ఆడాలనుకున్నాం. ఫీల్డింగ్ చేస్తున్నప్పుడే పిచ్‌ను క్షుణ్ణంగా గమనించాం. బౌన్స్ కాస్త ఎక్కువగా ఉందని అర్థమైంది. అయితే, మైదానం కొలతలు, బౌలర్ల వేగాన్ని ఉపయోగించుకుని పవర్‌ప్లేలో దూకుడుగా ఆడవచ్చని భావించాం. వైభవ్ తొలి ఓవర్‌లోనే దూకుడుగా ఆడటం జట్టుకు మంచి ఊపునిచ్చింది. అదే జోరును కొనసాగించాలనుకున్నాం" అని వివరించాడు.ఈ ప్రదర్శన వెనుక చాలా కఠోర శ్రమ, సరైన ప్రణాళిక ఉందని అభిషేక్ అన్నాడు. "కోచింగ్ సిబ్బంది, కెప్టెన్ నాపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు. ముఖ్యంగా మా కోచ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పాలి. నెట్స్‌లో సైడ్ ఆర్మ్ ద్వారా మేము చాలా ప్రాక్టీస్ చేశాం. ఒక బ్యాటర్‌గా



మ్యాచ్‌కు ముందు చేసే సన్నాహకమే అత్యంత కీలకం. పరిస్థితులు, మైదానం కొలతలను దృష్టిలో ఉంచుకుని, బౌలర్లకు అనుగుణంగా షాట్లు ఆడాల్సి ఉంటుంది. నిన్న ప్రాక్టీస్ సెషన్‌లో చేసిన ప్రణాళికలనే ఇవాళ అమలు చేశాను. ఈ ఇన్నింగ్స్ ఆడాలని బలంగా కోరుకున్నాను, అది నెరవేరింది" అని తన సంతోషాన్ని పంచుకున్నాడు.గతంలో 12 బంతుల్లో 50 పరుగులు చేసిన యువరాజ్ సింగ్, 'ఇప్పటికీ 12 బంతుల్లో హాఫ్ సెంచరీ చేయలేకపోయావ్' అంటూ సరదాగా చేసిన సోషల్ మీడియా పోస్ట్‌పై అభిషేక్ స్పందించాడు. "ఆ రోజుల్లో యువీ పాజీ ఎలాంటి క్రికెట్ ఆడాడో నాకు తెలియదు కానీ, 12 బంతుల్లో 50 పరుగులు చేయడం అస్సలు సులభం కాదు. ఏ బ్యాటర్ అయినా అలా ఆడాలనుకుంటే అది చాలా కష్టం. అది ఎప్పుడో ఒకసారి మాత్రమే జరుగుతుంది. అయితే, ఒక బ్యాటర్‌గా మేము ఆ మైలురాళ్ల కోసం ఆడం. జట్టు కోసం మ్యాచ్ గెలవాలనే లక్ష్యంతోనే బరిలోకి దిగుతాం" అని అభిషేక్ శర్మ స్పష్టం చేశాడు.

SPORTS

న్యూజిలాండ్ జట్టు కంటే

మా వాళ్లే నయం: శామీ



న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో టీమిండియా సృష్టిస్తున్న విధ్వంసంపై మాజీ కెప్టెన్, వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ శామీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల భారత్‌లో పర్యటించి 2-2తో సిరీస్‌ను సమం చేసిన తమ జట్టు సాధించిన విజయం ఎంత గొప్పదో ఇప్పుడు అందరికీ అర్థమవుతుందని అన్నాడు. కివీస్‌తో మూడో టీ20లో భారత బ్యాటర్ల ప్రదర్శన చూసి శామీ ఈ మేరకు స్పందించాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ సిరీస్ లో టీమిండియా వరుసగా మూడు మ్యాచ్ ల్లో నెగ్గి 3-0తో సిరీస్ కైవసం చేసుకోవడం తెలిసిందే. మరో రెండు మ్యాచ్ లు మిగిలుండగానే, శ్రేయస్ అయ్యర్ సేన ఈ ఘనత సాధించింది. కివీస్ తన సొంతగడ్డపై ఆడుతున్నా ఈ సిరీస్ లో ఇప్పటిదాకా ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. ఈ నేపథ్యంలో, డారెన్ శామీ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి."వావ్... అందుకే నేను మా జట్టును ప్రశంసించాను. భారత్‌లో వారు సాధించింది గొప్ప విజయం. టీమిండియా చాలా ప్రమాదకరమైన జట్టు. చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు స్వర్గధామంలాంటి పిచ్‌లు, బౌలర్లకు ఇబ్బంది కలిగించే తడి బంతి.. ఇలాంటి పరిస్థితుల్లో వారితో తలపడటం కష్టం" అని డారెన్ శామీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశాడువెల్లింగ్‌టన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ అద్భుత ప్రదర్శన చేసింది. 199 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముఖ్యంగా యువ బ్యాటర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు చేసి కివీస్ బౌలింగ్‌ను చిన్నాభిన్నం చేశాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి కేవలం 7.1 ఓవర్లలో 133 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు.ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా పలు రికార్డులను బద్దలు కొట్టింది. పవర్‌ప్లేలో వికెట్ నష్టపోకుండా 118 పరుగులు సాధించి, టీ20 చరిత్రలోనే అత్యధిక పవర్‌ప్లే స్కోరు నమోదు చేసిన జట్టుగా ప్రపంచ రికార్డు సృష్టించింది. కేవలం 5 ఓవర్లలోనే 100 పరుగుల మార్కును దాటి, ఈ ఘనత సాధించిన రెండో వేగవంతమైన జట్టుగా నిలిచింది.ఇటీవల భారత పర్యటన ముగిసిన తర్వాత కూడా శామీ ఇదే తరహా వ్యాఖ్యలు చేశాడు. "సిరీస్ ప్రారంభానికి ముందు ఎవరూ మా గెలుపు అవకాశాల గురించి మాట్లాడలేదు. కానీ మేము డిఫెండింగ్ ఛాంపియన్‌కు దీటుగా ఆడాం. కొన్ని విభాగాల్లో వారిపై ఆధిపత్యం కూడా ప్రదర్శించాం. మా జట్టు ఎంతో పురోగతి సాధించింది" అని శామీ అప్పుడు పేర్కొన్నాడు. ఇప్పుడు న్యూజిలాండ్‌పై టీమిండియా ప్రదర్శన చూశాక, తన వ్యాఖ్యలకు బలం చేకూరిందని పరోక్షంగా తెలియజేశాడు. భారత్, కివీస్ జట్ల మధ్య నాలుగో టీ20 శుక్రవారం ఆక్లాండ్‌లో, చివరి మ్యాచ్ ఆదివారం హామిల్టన్‌లో జరగనున్నాయి.

ఇలాంటి బ్యాటింగ్ ఎప్పుడూ చూడలేదన్న అయ్యర్..

వాళ్లను ఆపడం కష్టమన్న శాంట్నర్

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా చారిత్రక విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇరు జట్ల కెప్టెన్లు వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రత్యర్థి సారథి మిచెల్ శాంట్నర్ ఆ ఇద్దరినీ ఆకాశానికెత్తేశారు.ఈ అద్భుత ప్రదర్శనపై మ్యాచ్ అనంతరం శ్రేయస్ అయ్యర్ స్పందిస్తూ.. "నిజంగా అద్భుతం. వారిద్దరూ ఆడిన షాట్లు కళ్లకు చాలా ఇంపుగా అనిపించాయి. నేను, సంజు బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు బంతి సీమ్ అవుతోంది. వాళ్లిద్దరూ ఇలాంటి పిచ్‌పై అంత సులువుగా ఎలా ఆడగలిగారని ఆశ్చర్యపోయాను. ఇది నమ్మశక్యం కాని విషయం" అని అన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి బ్యాటింగ్ చూడటం ఇదే మొదటిసారని, ఐదు ఓవర్లలోనే 100 పరుగులు చేయడం ఎప్పుడూ చూడలేదని అయ్యర్ కొనియాడాడు. వారి ప్రదర్శన అన్నింటికంటే అత్యుత్తమమని ప్రశంసించాడు.మరోవైపు, న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కూడా భారత ఓపెనర్ల బ్యాటింగ్‌కు ఫిదా అయ్యాడు. "వాళ్లు అలా చెలరేగి ఆడుతుంటే ఆపడం చాలా కష్టం. వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను గతంలో ఐపీఎల్‌లో చూశాం. ఇప్పుడు మా దేశంలో ప్రత్యక్షంగా చూశాం. పవర్‌ప్లేలో ఎలా బ్యాటింగ్ చేయాలో వాళ్లు నిరూపించారు" అని శాంట్నర్



వ్యాఖ్యానించారు.మంగళవారం వెల్లింగ్టన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (113), వైభవ్ సూర్యవంశీ (45) తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. పవర్‌ప్లేలో రికార్డు స్థాయిలో 118 పరుగులు సాధించి భారత భారీ విజయంలో ప్రధాన భూమిక పోషించారు.